Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్: 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 173 | Tuesday : 17.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :173 | మంగళవారం 17 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4



## రెండు విడతల్లో కుల-జనగణన

- ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం జనగణనపై గెజిట్ విడుదల
- జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్, లడఖ్‌లో.. 2026 అక్టోబర్ 1 నాటికి కుల జనగణన ముగియనుంది.
- మిగతా రాష్ట్రాల్లో 2027మార్చి 1నాటికి జనగణన పూర్తి
- 15 ఏళ్ల తర్వాత దేశంలో జన గణన
- పౌరులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ గణనను కూడా ఎంచుకోవచ్చు

## యోగా నిర్వహణలో కొత్త రికార్డ్

- పదేళ్ల తర్వాత ఏపీలో అతిపెద్ద యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నాం
- సెక్రటేరియట్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పనిచేయాలి
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లోకి యోగా కార్యక్రమం ఎక్కేలా ఏర్పాట్లు చేస్తున్నాం
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నిరంతర శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం



**చిత్తూరు ఎక్స్ ప్రెస్, విశాఖపట్నం**

నగరంలో నిర్వహించే యోగా కార్యక్రమంతో సరికొత్త రికార్డ్ సృష్టించబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పదేళ్ల తర్వాత ఏపీలో అతిపెద్ద యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఈనెల 21న యోగా డే సందర్భంగా బీచ్ రోడ్‌లో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లని ఆయన పరిశీలించారు. బీచ్ రోడ్ నుంచి రుషికొండ వరకూ ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో అధికారులను అడిగి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సీఎంకు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్, ఐపీఎస్ అధికారులు వివరించారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీలో మంత్రుల కమిటీ, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్ యూనిట్‌గా సిబ్బంది పర్యవేక్షణపై ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఇతర సిబ్బందిని నియమిస్తే జవాబుదారీ ఉండదని ముఖ్యమంత్రి - మిగతా3లో



## భయంతో చచ్చిపోతున్నాం

- భారతీయుల తరలింపునకు కేంద్రం ఆపరేషన్!
- ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న వేళ ఇరాన్‌లో విదేశీయుల తరలింపునకు ఆ దేశ అధికారులు అనుమతి
- ఇరాన్‌లో సుమారు పదివేల మంది భారతీయులు ఉన్నట్టు తెలుస్తోంది
- ఆపరేషన్ పేరుతో ఖరారు చేయాల్సి ఉన్నట్టు సమాచారం.



## మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

- 140 కోట్ల భారతీయులకు దక్కిన గౌరవం
- 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3' ప్రధానం
- ఇరుదేశాల సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక
- రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం.

## రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రైతువేదికల్లో 'రైతునేస్తం'

- గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ కొందరికే చుట్టంగా మారింది
- మొదటి రోజు నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని భారాస నేతలు కుట్ర చేశారు.
- భారాస ప్రభుత్వం పదేళ్లలో రుణమాఫీ చేయలేకపోతే మేం ఆరు నెలల్లోనే చేసి చూపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది




### రైతుల కోసం రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు చేశాం: రేవంత్‌రెడ్డి

**చిత్తూరు ఎక్స్ ప్రెస్, రంగారెడ్డి**

గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ కొందరికే చుట్టంగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటి రోజు నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని భారాస నేతలు కుట్ర చేశారని మండిపడ్డారు. ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం రైతుల కోసం రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. భారాస ప్రభుత్వం పదేళ్లలో రుణమాఫీ చేయలేకపోతే మేం ఆరు నెలల్లోనే చేసి చూపించిన ఘనత కాంగ్రెస్ - మిగతా3లో



## నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం

- వెల్లడించిన ఆస్పత్రి వర్గాలు
- అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆమె దిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే
- ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితిని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ వెల్లడి

## అధిష్టానంతో సంప్రదించకుండా ప్రకటనలు చేయొద్దు




- మంత్రి పొంగులేటిపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సీరియస్
- కేబినెట్ అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అంటూ మండిపడ్డారు
- ఒకరి మంత్రిత్వ శాఖపై మరొకరు మాట్లాడటమేంటి

**చిత్తూరు ఎక్స్ ప్రెస్, హైదరాబాద్**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఆదివారం పొంగులేటి ప్రకటన చేశారు. ఈ విషయంలోనే పొంగులేటిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడిన ఎన్నికలపై పొంగులేటి ప్రకటనను టీపీసీసీ చీఫ్ తప్పుబట్టారు. కేబినెట్ అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అంటూ మండిపడ్డారు. ఒకరి మంత్రిత్వ శాఖపై మరొకరు మాట్లాడటమేంటని ప్రశ్నించారు. - మిగతా3లో



## ఆ వంతెన ప్రమాదకరమని ముందే హెచ్చరించాం

- సీఎం దేవేంద్ర ఫడణవీస్
- దీని తీవ్రత గురించి తెలియక పర్యటకులు దానిపైకి వెళ్లి ఉంటారు
- తుప్పు పట్టిన వంతెన బరువు ఆపలేక కూలిపోయింది
- అయితే.. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

## నా అరెస్ట్ తప్పదు.. ఎవర్నీ వదలను..



- తెలంగాణ కోసం అనేక సార్లు జైలుకు వెళ్లిన వ్యక్తిని
- ఫార్ములా ఈ-రేస్ అంశం నాలుగు గోడల మధ్య నన్ను విచారించడం కాదు
- అసెంబ్లీ సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు చర్చిద్దామని సవాల్
- చర్చించే దమ్ము, ధైర్యం లేక రేవంత్ రెడ్డి పారిపోయారు
- వారం కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరైన సమాధానాలు చెప్పారు.

**హైదరాబాద్**

తెలంగాణ కోసం అనేక సార్లు జైలుకు వెళ్లిన వ్యక్తిని తాను అన్నారు. ఫార్ములా ఈ-రేస్ అంశం నాలుగు గోడల మధ్య నన్ను విచారించడం కాదన్నారు. అసెంబ్లీ - మిగతా3లో

## బోయకొండను సందర్శించిన
## ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 16:**
ఆంధ్ర రాష్ట్రము, చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలము, దిగువపల్లి గ్రామములో ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలుతీర్చే కల్పవల్లి శ్రీబోయ కొండ గంగమ్మ దేవస్థానమునకు నేడు అనగా16వ తేదీన శ్రీయుత కమీషనరు, దేవదాయశాఖ, విజయవాడ శ్రీ రామ చంద్రమోహన్ విచ్చేసినారు. దేవస్థానములో శానిటేషన్, క్యూలైన్లు, ప్రసాదములు మొదలగు వాటి పై,భక్తులకు శ్రీఅమ్మ వారి దర్శనము సులువుగా జరిగినట్లు విలువైన సలహాలు, సూచనలు జారీ చేసియున్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం దేవస్థానములో పలు అభివృద్ధి పనులను చేయవలసినదిగా ఆదేశించియున్నారు. ఈ కార్యక్రమములో దేవస్థాన ఉప కమీషనరు, కార్య నిర్వ హణాధికారి జె. ఏకాంబరం, చౌడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీగువ్వల రమేష్ రెడ్డి, దేవస్థాన అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కులం పేరుతో ఫీల్డ్ అసిస్టెంట్ ను తొలగించడం నేరం: అంబేద్కర్ సాక్షిగా అన్యాయం జరిగింది

**ప్రభుత్వవిప్,కూటమి ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్తాం**
**జనసేనఇంచార్జి డాక్టర్ యుగంధర్ పొన్న.**



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్16:**
గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం, ఎస్ఆర్ పురం మండలం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆఫీస్ వద్ద జనసేనపార్టీ ఆధ్వర్యంలో జనసేనపార్టీ మండల అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యం లో పత్రికాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనా న్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్,మరియు జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న హాజర య్యారు. ఈ సందర్భంగా డాక్టర్ యుగం ధర్ పొన్న మాట్లాడుతూ మండలంలో గత పది సంవత్సరాలుగా ఎగువ కమ్మ కండ్రిక ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకటేశులును అకారణంగా, అన్యాయంగా తొలగించడాన్ని జనసేన తరఫునతీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ పంచాయతీలో తెలుగు దేశంపార్టీ అని చెప్పుకొని దామోదరం నాయుడు, వెంకటేశులు నాయుడు,సోమశేఖర్ నాయుడు, మురళి నాయుడు అనువారు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేయడానికి వీలులేదని,అనేక మార్లు గొడవలుపడటం, అతని ఇబ్బంది.పెట్టడం అనేక సందర్భాల్లో చేశారని తెలిపారు. ఇక్కడ ఉంటే తెలుగుదేశంఅయినా ఉండాలి, లేదా జనసేన అయినా ఉండాలని అతని విధులు అనేక మార్లు ఆటంకం కలిగించారని, దురుద్దేశపూర్వకంగా జిల్లా కలెక్టర్‌కి తప్పుడు సమాచారం, అందించారని ఈ సందర్భంగా తెలిపారు. అంబే ద్కర్ సాక్షిగా ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేషులకు అన్యాయం జరిగిందని ఆవేదనవ్యక్తం చేశారు. ఈ విధంగా కులం, మతం, ప్రాంతం భాషల ప్రాతిపదికన విభజించి చూడటా న్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు జరిగిన అన్యాయాన్ని గౌరవ ప్రభుత్వ విప్ మరియు కూటమి ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పురం మండల అధ్యక్షులు చిరంజీవి, కార్వేటినగరం మండల అధ్యక్షులు శోభన్ బాబు, పాలసము ద్రం మండల అధ్యక్షుడు లతీష్, ఎస్ఆర్ పురం మండలం ఉపాధ్యక్షులు చార్లెస్, చందు, ప్రధాన కార్యదర్శి సురేష్, పుల్లూరు సర్పంచ్ పవన్, కార్వేటినగర్ మండల ప్రధాన కార్యదర్శి ప్రతాప్,మండల బూత్ కన్వీనర్ సురేష్ రెడ్డి, నియోజకవర్గ యువ జనసంయుక్త కార్యదర్శి అన్నామలై, నియోజకవర్గం బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, యువజన నాయకులు చందు, జన సైనికులు పాల్గొన్నారు.

**ఘనంగా టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు**

## కన్నన్ జన్మదిన వేడుకలు





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 16:**
తెలుగుదేశం పార్టీ నాయకులు, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ జన్మదిన వేడుకలను కుప్పం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక టిడిపి నాయకులు కడా కమిటీ సభ్యులు డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో కన్నన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, దళిత యువజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులుగా, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులుగా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

# విద్యతో వ్యాపారం




### అధిక ఫీజులు.. వసతులు కరువు
### షాపులుగా మారిన పాఠశాలలు..
### ప్రైవేటు స్కూళ్లలో దోపిడీ..
### పాఠశాలల్లో జోరుగా పుస్తకాలు, యూనిఫామ్ విక్రయాలు

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 16:**
చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల, కార్పొరేట్ యాజమాన్యాలు నిబంధనలను అతిక్రమిస్తున్నాయి. స్కూల్‌లోనే పుస్తకాలు కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇందుకు ఏకంగా స్కూళ్లల్లోనే స్టాల్స్ ఏర్పాటు చేశారు. బుక్స్ మాత్రమే కాదు.. యూనిఫాం, టై, బెల్టులు తమ వద్దనే కొనాలని అంటున్నారు. చిత్తూరుజిల్లా పలమనేరు నియో జకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల, కార్పొరేట్ యాజమాన్యాలు నిబంధనలను అతిక్ర మిస్తున్నాయి. స్కూల్‌లోనే పుస్తకాలుకొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇందుకు ఏకంగా స్కూళ్లల్లోనే స్టాల్స్ ఏర్పాటు చేశారు. బుక్స్ మాత్రమే కాదు.. యూనిఫాం, టై, బెల్టులు తమ వద్దనే కొనాలని అంటున్నారు. దీంతో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం ,టై, బెల్టుల అమ్మకాలతో పాఠశాలల దుకాణాలను మరిపిస్తున్నా యి. ప్రైవేటు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యనందిం చాల్సిన యాజమా న్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యతో వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అంతేకాదు.. నర్సరీ మొదలు కొని పదో తరగతి వరకు స్టడీ మెటీరియ ల్, అదీ ఇదీ అంటూ వేలాది రూపాయల వసూలు చేస్తున్నా రని పిల్లల తల్లిదండ్రులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇలా నిబరొధనలను భేఖాతరు చేస్తు న్నా సంబంధిత అధికారులు పాఠశాలల వైపు కన్నెత్తి చూడ క పోవడం విమర్శలకు తావి స్తోంది.

**అధిక ఫీజులు.. వసతులు కరువు**

నియోజవర్గంలోని ఆయా మండలాల్లో ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజుల కంటే ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు వసతులు కల్పించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో సామర్థ్యానికి మించి ఇరుకు గదుల్లో 30 నుంచి 50 వరకు విద్యార్థులను కూర్చొబెట్టి పాఠ్యాంశాలు బోధిస్తుండటంతో పాఠ్యాంశాలు అర్థమయ్యేదెలా అని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరో వైపు కొన్ని పాఠశాలలో వేలాది మంది విద్యార్థులుంటే టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు పదుల సంఖ్యలో ఉండటంతో క్యూలో నిలబడి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇక నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.


**షాపులుగా మారిన పాఠశాలలు..**

పాఠశాలలు ప్రారంభమైన నాటి నుంచే ప్రైవేటు పాఠశాలలు షాపులుగా మారాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థుల స్టడీ మెటీరియల్ కొనాలనే ఉపాధ్యాయుల ఒత్తిడితో తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతన్నారు. ప్రారంభంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాఠ్యాంశాలు మొదలుపెట్టాల్సిన ఉపాధ్యాయులు టై, బెల్టులు, యూనిఫాం, షూ, స్టడీ మెటీరియల్ తప్పనిసరని చెప్పటంతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఆర్థికభారంతో సతమ తమవుతున్నారు.

**అధిక ఫీజుల నియంత్రణపై అధికారుల పట్టింపేది ?**

కూలీ,నాలీ పనులు చేసుకొని పిల్లలను చదివించాలనే తల్లిదండ్రులకు ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా చితికిపోతు న్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధికంగా ఫీజులు పెంచడంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారింది. అధిక ఫీజులను నియంత్రించాల్సిన అధికారులు సైతం తమకేమి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తూ పాఠశాల ల వైపు కన్నెత్తి చూడటం లేదని విద్యార్థి సంఘాల నేతలు, తల్లిదండ్రులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. దీంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై దృష్టి సారించి నివారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ప్రైవేటు పాఠశాలలపై వెంటనే డి.ఇ.ఓ చర్యలు తీసుకోవాలి**
**భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు యు.గణపతి**






ప్రైవేట్ స్కూల్స్ పిల్లలని వారి తల్లితండ్రులను ఇష్టం వచ్చినట్లు పుస్తకాలు,యూనిఫామ్ పేరుతో దోపిడీ చేస్తుంటే కనీసం స్పందించలేని పరిస్థితిలో విద్య శాఖ వుంది, స్కూల్స్ ఎలాంటి స్టేషనరీ కానీ యూనిఫామ్ కానీ అమ్మకూ డదని పక్క నిబంధ నలు వున్నా, డిఈఓలు ప్రైవేటు విద్యాసంస్థలపై దాడులు చేసి వీటిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవ డం లేదు. చిత్తూరు జిల్లా హెడ్ క్వార్టర్ మరియు అన్ని మండలాలలో తదితర ప్రాం తాల్లో నిబంధనలకు భిన్నంగా జరుగుతుంది. తక్షణమే డి.ఇ.ఓ పట్టణం లోని అన్ని ప్రైవేట్ విద్య సంస్థలని పర్యటించి ప్రైవేట్ స్కూల్ యాజమాన్యల దోపిడీకి అడ్డు కట్టు వేయాలని కోరుతున్నాము. అలాగే ఫీజులపై కూడా నియంత్ర ణ విధించాలని కోరుతున్నాం.

## జనసేన నాయకులు సత్య వేడు కోర్టుకు హాజరు



**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 16:**
వరదయ్యపాలెం మండలం జనసేన నాయకులు సోమవారం సత్యవేడు కోర్టుహాజరు. 2023 జూలై 11న వైసీపీ నాయకులు, వాలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడంతో నిరసనగా జనసేనపార్టీ జిల్లాకార్యదర్శి తడ, శ్రీనివాసులు, ఆధ్వర్యంలో అదే రోజున పవన్ కళ్యాణ్ చిత్రపటానికి బస్టాండ్ ఆవరణలో పాలాభిషేకం చేయడం జరిగింది. దీనితో వైసిపి నాయకులు జనసేన కార్యకర్తలపై కక్ష పూర్వకంగా ఎనిమిది మంది జనసేన కార్యకర్తలపై క్రిమినల్ కేసునమోచేయడం జరిగింది. ఈ కేసులో ఈరోజు కోర్టుకుహాజరైన వారు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తడ, శ్రీనివాసులు, శ్రీధర్, సాగర్, శేఖర్, జయ కుమార్, జనార్ధన్, రాజేష్, యోగేష్, హాజరయ్యారు.

## తండ్రిపై దాడి చేసిన కుమారుడికి రిమాండ్



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 16 :**
తండ్రిపై దాడిచేసి అతని మరణానికి కారకుడైన కుమారుడిని రిమాండ్కు తరలించినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. చౌడేపల్లి మండలం ఏ కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లి గ్రామానికి చెందిన చిన్నప రెడ్డి పై అతని కుమారుడు మనోహర్ రెడ్డి మార్చి 30న తీవ్రంగా దాడిచేసి గాయపరి చాడు దీంతో మనోహర్ రెడ్డితో పాటు అతని భార్య సరస్వతిలపై కేసు నమోదు చేశారు. చిన్నపరెడ్డి ఏప్రిల్ 9న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చెయ్యి తీవ్ర మనోవేలకు గురై ఏప్రిల్ 21న మరణించాడు, దీంతో ఆ కేసులో పరారీలో ఉన్నముద్దాయి అయిన మృతుడుచిన్నపరెడ్డి కుమారుడు మనోహర్ రెడ్డిని అరెస్ట్ చేసి పుంగునూరు న్యాయస్థానంలో హాజరుపరచగా జడ్జి రిమాండ్కు ఆదేశించినట్లు ఎస్సై నాగేశ్వ రరావు తెలిపారు.

## తాహసిల్దార్‌ను సత్కరించిన మాలమహానాడు నాయకులు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 16**



చౌడేపల్లి మండలంలోని నూతనంగా నియమితులైన తహసిల్దార్ పార్వతమ్మను మాలమహానాడు సంఘనాయకులు సన్మానించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్తపల్లి మనీ మాట్లాడుతూ చౌడేపల్లిమండలంలో దళితుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. మాలమహానాడు దృష్టికి వచ్చిన సమస్యను మీ దృష్టికి తీసుకువస్తాము, ఆ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాలమహానాడు మండలాధ్యక్షుడు కొత్తపల్లి మనీ కోరగా దానికి తహసిల్దారు మేడం సానుకూలంగా స్పందించా రు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి మండలాధ్యక్షుడు కొత్తపల్లి మనీని యోజకవర్గం ఇన్చార్జి కృపామని మండల ఉపాధ్యక్షుడు శ్రీరాములుమండల జనరల్ సెక్రెటరీ నక్క సురేష్ గుట్ట రెడ్డి, శేఖర్ ఎల్లకుంట్ల మనీ ముకుంద, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

## అతిసార నివారణకు కృషి చేద్దాం : డాక్టర్ పవన్ కుమార్



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 16:**
అతిసారవ్యాధి నివారణకు కృషిచేద్దామని మండల వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నివారణ పై ర్యాలీ పలువురికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ పవన్ కుమార్ ప్రసంగిస్తూ ఈగలు వాలినఆహారం తీసుకోవడం, వల్ల కలుషితమై వాంతులువిరేచనాలు కలుగు తాయి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 16 నుంచి 31తేదీ వరకు మండలవ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓఆర్ఎస్ ద్రావణం చేసుకునే విధానాన్ని వివరించారు. బాగా కడిగిన తర్వాతనే పండ్లు కూరగాయలు ఉపయోగించాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరి సరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఆహారనియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు బహుద్దీన్ జమున ఎంఎల్‌హెచ్‌పిలు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యా ఉపయోగకర వస్తువులు పంపిణీ

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 16:**



చౌడేపల్లి మండలంలోని పలుపాఠశాలల్లో దాతలు విద్యా ఉపయోగకర వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణ రాజు (పతి రాజు) దాతృత్వంతో శెట్టిపేట పదేళ్లపల్లి యువజనుల ఆధ్వర్యంలో రెండు పంచాయతీలలోను గల పాఠశాలల్లో గల విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. శెట్టిపేట మేకల చిన్నపల్లి పందిళ్ళ పల్లి ప్రాథమికపాఠశాలలతో పాటు మేకల చిన్న పల్లి ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు దాదాపు రూ 2లక్షల విలువచేసే నోటు పుస్తకాలుస్టడీ మెటీరియల్ పెన్నులు పెన్సిళ్లు వంటి విద్యఉపయోగకర వస్తువులు పంపిణీ చేశారు. అదే విధంగా శెట్టిపేటపాఠశాలలో గ్రౌండ్ ఫ్లోర్ మ్యాట్ మేకల చిన్న పల్లి అంగన్వాడి కేంద్రానికి స్మార్ట్ టీవీ వంటివి బహూకరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు సాగిరాజు ప్రదీప్ రాజు వెంకటరమణ సుధాకర్ ప్రవీణ్ కుమార్ రాఘ వేంద్ర రాజు కుమార్ సుబ్రహ్మణ్యం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

## తహసిల్దార్‌కు ఘన సన్మానం

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 16:**



చౌడేపల్లి మండలం నూతన తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన పార్వతిని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన పార్వతికి పుష్పగుచ్ఛం అందించి దుశాలువాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలో నెలకొనిఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతన పరిష్కరించాలని గువ్వల రమేష్ రెడ్డి తాసిల్దార్ పార్వతిని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనా యకులు ఆవుల రామచంద్రయ్య, పూల చంద్రమౌళి, వేలూరు సుబ్రహ్మణ్యం, బోయకొండ సుబ్బు, రమణ, గని కుమార్ రెడ్డి, మండలంలోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# యోగా నిర్వహణలో కొత్త రికార్డ్

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు స్పష్టం చేశారు. సెక్రటేరియట్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్‌లోకి యోగా కార్యక్రమం ఎక్కేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నిరంతర శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. దాదాపు 3.4 లక్షల మంది ఒకే చోట యోగా చేయడానికి ఏర్పాట్లు చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖలో ఐదు లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒక్కచోటే మూడు లక్షల మందితో యోగా చేసేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఏపీవ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా డేలో పాల్గొంటారని చెప్పారు. యోగా డేలో నేవీ 11 యుద్ధ నౌకలను ప్రదర్శిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఒక చారిత్రక కార్యక్రమానికి విశాఖపట్నం వేదిక అవుతోందని అన్నారు. 11ఏళ్ల యోగా డేకు విశాఖ అనువైన ప్రదేశమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

'ప్రశాంతతకు, పాజిటివ్ యాటిట్యూడ్‌కు నిలయం విశాఖపట్నం. ఇక్కడి ప్రజలకు ఒక పిలుపునిస్తే పాటిస్తారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖలో చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు. యోగాకు అనువైన ప్రదేశం విశాఖపట్నం. యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి. ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు యోగా ద్వారా తగ్గుతాయి. యోగా అనేది వారసత్వ సంపద.. ప్రజల భవిష్యత్ కోసం చేస్తున్న పెద్ద ఈవెంట్ ఇది. అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతున్నాం. యోగా ప్రివెంటివ్ హెల్త్‌కి బాగా ఉపయోగ పడు తుంది. యోగాకు కొంత సమయం కేటాయిం చాలి. హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీ కోసం పనిచేస్తు న్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగాని ఎక్కువగా ప్రమోట్ చేస్తున్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.



22 రికార్డులు నమోదు చేయబోతున్నాం..

'యోగా ద్వారా గిన్నిస్ రికార్డుతో పాటుగా సుమారుగా 22 రికార్డులు నమోదు చేయబోతున్నాం. వర్షం వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశాం. ప్రస్తుతం వర్షం వచ్చేందుకు ఆస్కారం లేదు. సెంట్రల్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగా చేయాలని ఆలోచన చేస్తున్నా%శీ%. యోగాని సమర్థవంతంగా, నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి. ఈ కార్యక్రమం తదనంతరం కూడా యోగాని కొనసాగిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# నా అరెస్ట్ తప్పదు.. ఎవర్నీ వదలను..

-మొదటిపేజీ తరువాయి

సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు చర్చిద్దామని సవాల్ చేశారు. చర్చించే దమ్ము, ధైర్యం లేక రేవంత్ రెడ్డి పారిపోయారన్నారు. వారం కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరైన సమాధానాలు చెప్పారు. పార్ములా ఈ రేసు కేసులో విచారణకు మరోసారి హాజరవుతున్నారు. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డికి సవాల్ చేశారు. ఇలాంటి విచారణలకు బీఆర్ఎస్ బెదిరిపోదని ఎన్ని కుట్రలైనా చేసుకోవాలంటూ సవాల్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. ఒకసారి కాదు వందసార్లైనా జైలుకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం, రేవంత్ రెడ్డిపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీ విచారణలు, కమిషన్ల వలన, రాజకీయ వేధింపుల వలన వెనక్కి తగ్గేదేలేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలు మోసాన్ని ఎండబెట్టడంలో తమను ఇవేవీ ఆపలేవని స్పష్టం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా భారత రాష్ట్ర సమితి కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో, డిక్లరేషన్ల పేరుతో ప్రజలకు చేసిన దగాను ఎండగడుతూనే ఉంటమని స్పష్టం చేశారు. ఎన్ని కుట్రలైనా చేసుకో రేవంత్ రెడ్డి అంటూ సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ సవాల్ చేశారు. ఫార్ములా ఈ రేసు కేసులో విచారణకు హాజరయ్యే ముందు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ ప్రజల కోసం ఒకసారి కాదు వందసార్లు అయినా జైలుకు వెళ్తానని చెప్పుకొచ్చారు. ఒకటి కాదు వెయ్యి కేసులు పెట్టుకున్నా తెలంగాణ ప్రజల తరఫున కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వానికి బీఆర్ఎస్ శ్రీరామ రక్ష అని పునరుద్ఘాటించారు. పార్ములా ఈ రేసుకు సంబంధించి పూర్తి అవగాహన ఉన్నందున మరోసారి విచారణకు రావాలని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ నోటీసులు ఇచ్చారు కేటీఆర్‌తో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహించారు. ఇందులో నిధుల చెల్లింపులో అక్రమాలు జరిగాయని ఆరోపణలతో ఏసీబీ విచారణ చేపట్టింది. ఇప్పటికే ఈ కేసులో ప్రత్యేకప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెడ్ ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ ఎన్ రెడ్డిని అధికారులు ప్రశ్నించారు. లండన్‌లో ఉన్న పార్ములా ఈ ఆపరేషన్స్ ఎఫ్ఓను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రశ్నించారు. తనను అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తారని తెలుసన్నారు మాజీ మంత్రి కేటీఆర్. తనకు జైలు కొత్తేమీ కాదన్నారు. .కేటీఆర్‌ను కూడా ఇప్పటికే ఒకసారి ఏసీబీ అధికారులు విచారించారు. ఇప్పుడు మరోసారి విచారణకు రావాలనీ? గతనెల 29న నోటీసులు జారీ చేశారు. తాను విదేశాల్లో ఉన్నందున ఆ తేదీల్లో విచారణకు రాలేకపోతున్నాననీ అధికారులకు సమాచారం ఇచ్చారు. తిరిగి వచ్చిన తర్వాత దర్యాప్తునకు వస్తాని స్పష్టం చేశారు. దీంతో ఆయన విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత మరోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో ఇవాళ విచారణకు హాజవుతున్నారు. 6 జనవరి 2025 న ఏసీబీ మొదటి సారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.



# తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు

## సిట్ ముందుకు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ :** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సాక్షిగా మారబోతున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం వద్ద ఆయన తన వాంగ్మూలం ఇవ్వనున్నారు. నవంబర్ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ ఫోన్‌ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షులుగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌ను కేసు విచారణలో భాగంగా సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని జూబ్లీహిల్స్ ఏసీపీ కోరారు. పోలీసుల సూచన మేరకు ఆయన మంగళవారం హాజరుకానున్నారు. ఈ కేసులో గతంలో ూఎఃః మాజీ చీఫ్ ప్రభాకర్ రావును కూడా పోలీసులు విచారించారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న రాజకీయ నాయకుల ఫోన్‌లను ట్యాప్ చేయడానికి ఎస్ఐబీలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన ఒప్పుకున్నట్లు తెలిసింది. కాంగ్రెస్, బీజేపీ నాయకులపై నిఘా పెట్టినట్లు కూడా తెలుస్తోంది. గతంలో అరెస్ట్ అయిన అధికారులు ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే తాము పనిచేశామని ఇప్పటికే సిట్ విచారణలో తెలిపారు. బీఆర్ఎస్ 2023 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేయగా.. ఆ తర్వాత ఎస్ఐబీ కార్యాలయం నుంచి హార్డ్ డిస్క్‌లు అదృశ్యమయ్యాయి.. ఈ కేసులో విచారణను వేగవంతం చేయడానికి ప్రభాకర్ రావు, మరో నిందితుడైన డీఎస్పీ ప్రణీత్ రావులను కలిపి విచారించే అవకాశం ఉంది. ఈ కేసులో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు, జర్నలిస్టులు, పౌర సమాజ సభ్యులు, చివరికి న్యాయమూర్తుల ఫోన్‌లు కూడా ట్యాప్ చేయబడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసులో అరెస్టయిన ప్రణీత్ రావు, సెన్సిటివ్ నిఘా డేటాను కలిగి ఉన్న హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి, వాటిని మూసీ నదిలో పారేసినట్లు ఒప్పుకున్నారు. ఇది కేవలం ఫోన్ ట్యాపింగ్‌కు మాత్రమే పరిమితం కాకుండా ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుల కదలికలు, ఆర్థిక లావాదేవీలు, అంతర్గత వ్యూహాలను పసిగట్టేందుకు అప్పటి ప్రభుత్వం చేసిన ప్రయత్నంగా భావిస్తున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా మహేష్ కుమార్ గౌడ్ వాంగ్మూలం అనంతరం మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## అన్నా... చెల్లెమ్మ ప్రేమ..

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వంకుట్ల తారకరామారావు, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్య రాజకీయ విభేదాలు ఇటీవల బయటపడ్డాయి. కేటీఆర్‌ను పార్టీ వారసుడిగా ప్రకటించడం కవితకు నచ్చలేదు. దీంతో డీయర్ డాడీ.. అంటూ కేసీఆర్‌కు ఓ లేఖ రాసింది. పార్టీలోని లోపాలను బయటపెట్టింది. దీంతో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇలాంటి సమయంలో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులపై కవిత స్పందించడం చర్చనీయాంశమైంది. తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత, కేటీ రామారావు (కేటీఆర్) మధ్య పార్టీ వ్యవహారాలపై విభేదాలున్నాయన్న ప్రచారం నేపథ్యంలో, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కవిత,ఫార్ములా?ఈ కేసులో కేటీఆర్‌కు యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) జారీ చేసిన తాజా నోటీసును తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాజకీయ ఉద్దేశంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రగా కవిత ఆరోపించారు. ఈ సంఘటన రాజకీయ వివాదాన్ని రేకెత్తించడమే కాకుండా, బీఆర్ఎస్?కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తతను మరింత పెంచింది.కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణలో నిర్వహించిన ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు. అయితే, ఈ ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న ఆరోపణలతో ఏసీబీ, కేటీఆర్‌తోపాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌పై కేసు నమోదు చేసింది. ఈ కేసులో భాగంగా, ఏసీబీ ఈ ఏడాది జనవరిలో కేటీఆర్‌ను రెండుసార్లు విచారించింది. అలాగే, జనవరి 16న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు కూడా కేటీఆర్ హాజరయ్యారు..తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, మీడియాతో మాట్లాడుతూ, ఈ నోటీసును రాజకీయ ప్రతీకారంగా అభివర్ణించారు. "మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ జారీ చేసిన నోటీసు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న రాజకీయ కుట్ర తప్ప మరొకటి కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నోటీసును మళ్లీ జారీ చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా, వారి వైఫల్యాలను ప్రజల ముందు బయటపెడతాం," అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్పందన, కవిత?కేటీఆర్ మధ్య విభేదాల పుకార్లను తిప్పికొట్టడమే కాకుండా, బీఆర్ఎస్‌లో ఐక్యతను ప్రదర్శించే ప్రయత్నంగా కనిపిస్తుంది.బీఆర్ఎస్ కోణంలో.. కవిత ఆరోపించినట్లు, ఈ నోటీసు కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి జారీ చేసినదిగా భావిస్తున్నారు. ఫార్ములా?ఈ కేసు గతంలోనూ వివాదాస్పదమైన నేపథ్యంలో, ఈ నోటీసు బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలహీనపరచడానికి ఉపయోగపడుతుందని వారు వాదిస్తున్నారు.ఏసీబీ కోణంలో.. ఫార్ములా?ఈ ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై చట్టపరమైన విచారణ జరుపుతున్నట్లు పేర్కొంటోంది. కేటీఆర్, అరవింద్ కుమార్‌లపై నమోదైన కేసు ఆధారంగా, విచారణను ముందుకు తీసుకెళ్లడం తమ బాధ్యతగా ఏసీబీ భావిస్తుంది.ఈ నోటీసు, తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను లేవనెత్తుతూ, ఈ నోటీసును రాజకీయ కుట్రగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది.

## వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

పరికరాలు, సరిపడా పడకలను పెంచాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ అనుమతులకు తాను చొరవ తీసుకుంటానని తెలిపారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ భాషను ఆప్షనల్‌గా బోధించాలని కోరారు. జపాన్‌లో తెలంగాణ నర్సులకు డిమాండ్ ఉందని అన్నారు. ఆస్పత్రుల్లో రోగులు, వైద్యుల మానిటరింగ్ కోసం యాప్‌పై అధ్యయనం చేయాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలపై ప్రతి నెల మూడో వారం సమీక్ష నిర్వహించాలని వైద్యశాఖ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, వైద్యారోగ్య శాఖ డైరెక్టరేట్ డాక్టర్ నరేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అధిష్టానంతో సంప్రదించకుండా ప్రకటనలు చేయొద్దు

-మొదటిపేజీ తరువాయి





అధిష్టానంతో సంప్రదించకుండా ప్రకటనలు చేయొద్దని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ రేపు(మంగళవారం) పోలీసులకు వాంగ్మూలం ఇవ్వనున్నారు. 2023 ఎన్నికల వేళ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్‌గౌడ్ పనిచేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాపింగ్ చేసిందని మహేష్‌గౌడ్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

**పొంగులేటి ఏమన్నారంటే..**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నెలాఖరులోపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిపారు. త్వరలో ఎన్నికల తేదీల ప్రకటన ఉంటుందని అన్నారు. సోమవారం జరిగే కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, అనంతరం సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే పొంగులేటి అధిష్టానాన్ని సంప్రదించకుండా స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా మాట్లాడతారని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ ప్రశ్నించారు. ఇప్పుడు ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

## హాస్టల్ విద్యార్థులకు యోగ పై అవగాహన





**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 16:** వి.కోటపట్టణంలోని ప్రభుత్వ వసతి గృహ విద్యార్థినీ విద్యార్థిలకు సోమవారం యోగా పై అవగాహన కల్పించారు. బెంగళూరులోని స్వామి వివేకానందా యోగా అనుసంధాన సంస్థానం విశ్వవిద్యాలయంలో అభ్య సించే వారు వి.కోట ప్రభుత్వ వసతి గృహ బాలు రూ, బాలికలకు వేరు వేరుగా యోగాశిక్షణ కల్పించారు. ప్రతి రోజు యోగా చేయడం. ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి పలు ఆసనాలు నేర్పించారు. కార్యక్ర మంలో విశ్వవిద్యాలయ విద్యార్థిను లు డి.సి.గాయత్రి, ఎన్.జైశ్రీ, సి.హసిత, జి.పూజిత రెడ్డి పాల్గొన్నారు.

## "కళాజ్యోతి " జాతీయపురస్కారం అందుకున్నకవులు

**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 16:**



వీ.కోటపట్టణానికి చెందిన కవులు డాక్టర్ కొట్టారి వెంకటరత్నం, డాక్టర్ గడ్డం శాంతమ్మ, డాక్టర్ వి రఘుపతి గార్లు భారతీయ తెలుగు రచయితల సమా ఖ్య, ఎం.వీ.కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్ చిత్తూరు ఆంధ్రప్రదేశ్ (ద.భా)వారి సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగు తేజాలకు కళాభి షేకం "గొప్ప కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళా జ్యోతి జాతీయ పురస్కారం 2025- అంద జేశారు. దేశనలు మూలల నుండి తెలుగు బుక్ రికా ర్డ్, వండర్ బుక్ఆఫ్ రికార్డ్ కోసం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన ద్విశతాధిక, కవులు, వివిధ సాహితీ కళాకారులను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మన వి.కోటకు చెందినకవులు డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం, డాక్టర్ గడ్డం శాంతకుమారి, డాక్టర్ రఘుపతిలకుచోటుదక్కింది.ఈ కార్య క్రమలో సినీ ప్రముఖనటులు పద్మశ్రీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ సినీగీత రచ యిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, స్థానిక శాసన సభ్యులు గురుజాల జగన్మోహన్, నగర చేర్మెన్ కఠారి హేమలత, మర్రిపూడి దేవేంద్ర రావు, డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ మర్రి శశిధర్ రెడ్డి ప్రముఖ సంఘ సేవకులు, సహదేవ నాయుడు, ఎం ఆర్ అరుణ కుమారి వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ కార్డ్ అధికారులు, ప్రము ఖ సినీప్రముఖులు, కళాకారులు, కవులు అనేకమంది సాహితీ మూర్తులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సన్మాన సభను విజయవంతం చేయండి




**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 16:**
అన్నమయ్యజిల్లా పీలేరు మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సన్మానసభను విజయ వంతం చేయాలని విహెచ్ పిఎస్ పీలేరునియోజకవర్గం ఇంచార్జ్ రామ మోహన్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ దానియల్ మాదిగఆదేశాల మేరకు పీలేరు ఎం ఆర్ పి ఎస్ కార్యాల యంలో పాత్రికేయులసమావేశంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో పాటు వికలాంగుల హక్కులు, గుండె జబ్బుల పిల్లలపై అనేక సామాజిక ఉద్యమాలుచేయడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం చాలా గర్వకారణంగా ఉందని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ఆయన పద్మశ్రీ పురస్కారం అందుకోవడం. జరిగిందని ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ ఈ అవార్డు కేవలం నేను మాత్రమే కాదు యావత్ నాకు అండగా ఉండిన సామా జిక, అణగారిన సమాజానికి ఇచ్చినట్లుగా భావిస్తున్నానని తెలపడం మాకందరికీ గర్వకారణంగా ఉందన్నారు. విహెచ్పిఎస్ జాతీయ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన హైదరాబాద్ నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాల్లో ఘనంగా సన్మానసభ ఏర్పాటు చేయడం. జరుగుతుందని ఈ సభను అన్నమయ్య జిల్లాలోని విహెచ్పిఎస్ నాయకులతో పాటు అనుబంధ సంఘాల నాయకులు అందరూ పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్, కో ఇన్చార్జి అమరాల వెంకటరమణ, విహెచ్పిఎస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, సుభహాన్, వెంకటేష్, ఎం ఆర్పిఎస్ నాయకులు నరసింహ, రాము, మాధవ తదితరులు పాల్గొన్నారు.

## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజైన సోమవారం లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు ఒకశాతం వరకు లాభాలను నమోదు చేశాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా మార్కెట్లు రాణించాయి. సెన్సెక్స్ కిత్రం సెషన్‌తో పోలిస్తే 81,034.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 81,012.31 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,865.82 పాయింట్ల వరకు పెరిగింది. నిఫ్టీ 227.90 పాయింట్లు లేదా 0.92 శాతం పెరిగి 24,946.50 వద్ద ముగిసింది. దాదాపు 1898 షేర్లు లాభపడగా.. 2,026 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడ్డ వాటిలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఓఎన్‌జీసీ ఉన్నాయి. అయితే టాటా మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా నష్టపోయాయి. ఐటీ, మెటల్, రియాలిటీ, ఆయిల్, గ్యాస్ ఒక్కొక్కటి ఒకశాతం పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.9 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి.

# యువతకు బెస్ట్ పెట్టుబడి మార్గాలు



పెట్టుబడి విషయానికి వస్తే యువతకు, వయసుపైబడిన వారికి మధ్య ఉన్న తేడా ఇన్వెస?మెంట్లను ముందుగా ప్రారంభించడం. యువతకు దీర్ఘకాలంలో ఇది ఎంతో కలిసొస్తుంది. 40-45 ఏళ్లు దాటిన వారితో సమానంగా యువత ఏదైనా పథకంలో పెట్టుబడి పెట్టి ఒకే సమయంలో ఉపసంహరించుకుంటే కచ్చితంగా యువతకు ఎంతో లాభం చేకూరుతుంది. అయితే ఎలాంటి పథకాల్లో పెట్టుబడి ప్రారంభించాలో స్పష్టత ఉండడంలేదు. యువకులు క్రమశిక్షణతో, ఆర్థిక నిపుణుల సలహాతో మంచి పథకంలో పెట్టుబడి ప్రారంభిస్తే ఆకర్షణీయ రాబడిని అందుకోవచ్చు. మార్కెట్‌లోని కొన్ని పథకాల గురించి తెలుసుకుందాం.

పొదుపు ఖాతాలు, డిపాజిట్ సర్టిఫికెట్లు (సీడీలు)
పొదుపు ఖాతా అనేది డబ్బును నిర్వహించేందుకు సరళమైన, అత్యంత రిస్క్ లేని మార్గం. అయితే ఇందులో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పటికీ ఈ ఖాతాలు సురక్షితమైనవి. మరోవైపు సీడీలు మీ డబ్బును నిర్ణీత కాలానికి (6 నెలలు లేదా ఒక సంవత్సరం) లాక్ చేస్తాయి. అందుకు కొంత అధిక మొత్తంలో రాబడిని అందిస్తాయి.

**స్టాక్ మార్కెట్**
స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టడం ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా ఉంటుంది. మంచి కంపెనీని ఎంచుకొని పెట్టుబడి కొనసాగిస్తే కాలక్రమేణా అధిక రాబడిని అందించగలవు. అయితే ఇవి అస్థిరంగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. వీటిలో రిస్క్ అధికంగా ఉంటుందని మరిచిపోకూడదు.

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), మ్యూచువల్ ఫండ్స్
ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్ స్టాక్స్‌లో నిర్ణీత షార్ట్‌టర్మ్‌లో ఒడిదొడుకులు ఉన్నప్పటికీ లాంగ్‌టర్మ్‌లో మంచి రాబడిని అందిస్తాయి. అయితే ఇందుకు పెట్టుబడులను కొనసాగించాల్సి ఉంటుంది. ఈటీఎఫ్‌లు(కొన్ని స్టాక్స్ కలిపి ఉన్న ఫండ్) మార్కెట్‌లో నేరుగా లైవ్‌లో ట్రేడవుతాయి. మ్యూచువల్ ఫండ్స్ కూడా సెక్టార్ వారీగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. వాటిని నిత్యం ఫండ్ మేనేజర్ నిర్వహిస్తుంటారు.

**బాండ్స్**
బాండ్లు అంటే కాలానుగుణ వడ్డీ చెల్లింపుల కోసం కంపెనీలు లేదా ప్రభుత్వాలకు ఇచ్చే రుణాలు. ఇవి స్టాక్స్ కంటే సురక్షితమైనవి. కానీ, తక్కువ రాబడిని అందిస్తాయి.

**రియల్ ఎస్టేట్ (ఆర్ఈఐటీ)**
రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (ఆర్ఈఐటీలు) యువ పెట్టుబడిదారులను భౌతిక ఆస్తిని కొనుగోలు చేయకుండానే రియల్ ఎస్టేట్ పెట్టుబడుల నుంచి డివిడెండ్ సంపాదించడానికి వీలు కల్పిస్తాయి. వీటిని చాలా బ్రోకరేజీ ఖాతాల ద్వారా కొనుగోలు చేయవచ్చు. ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోను వైవిధ్యపరచడానికి ఇది మంచి మార్గాన్ని అందిస్తుంది.

**విద్య, నైపుణ్యాలు**
విద్య, సర్టిఫికేషన్లు లేదా అధిక ఆదాయాన్ని సమకూర్చే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం (కోడింగ్, డిజైన్ వంటివి) కోసం పెట్టుబడి పెట్టడం అన్నింటికంటే మంచి ఇన్వెస్ట్‌మెంట్. దీన్ని ఎంత త్వరగా ప్రారంభిస్తే కెరియర్‌లో అంత ప్రయోజనం పొందుతారు.

# ఉద్యోగాల కోతకు ఏఐ సాకు!




కృత్రిమమేధకు ఆదరణ పెరుగుతున్న కొద్దీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో గుబులు అధికమవుతోంది. తమ ఉద్యోగాల స్థానంలో ఏఐ పాగా వేస్తుందని చాలామంది జంకుతున్నారు. ఇదే అదనుగా కొన్ని కంపెనీలు కాస్ట్ కటింగ్, పునర్వ్యవస్థీకరణ పేరుతో ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలపర్ల స్థానాన్ని ఏఐ భర్తీ చేస్తుందని చెబుతూ కొన్ని కంపెనీల వ్యవస్థాపకులు, సీఈఓలు తమ మోడళ్ల అమ్మకాలను పెంచుకోవడానికి ఎక్కువగా ప్రచారం చేస్తున్నట్లు ఏఐ కోడింగ్ ప్లాట్‌ఫామ్ విండ్సర్ఫ్ వ్యవస్థాపక బృందం సభ్యుడు అన్షుల్ రామచంద్రన్ తెలిపారు. 'ఏఐ ప్రభావం పెరుగుతోందని చెబుతున్నవారిలో చాలా మంది ఎలాగైనా కొందరు ఉద్యోగులను తొలగించాలని కోరుకుంటున్నారు. అందుకు ఏఐను సాకుగా వాడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కోసం ప్రత్యేకంగా ఏఐ నమూనాలను రూపొందిస్తున్నారు. మరిన్ని మోడళ్లను విక్రయించడానికి ఇది వ్యాపార వ్యూహంగా పని చేస్తుంది. డెవలపర్ అడాప్షన్, ఎంటర్‌ప్రైజ్ పార్ట్‌నర్‌షిప్ పరంగా అమెరికా తర్వాత భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరిస్తోంది. భారత్‌లో 1.7 కోట్ల మంది డెవలపర్లు ఉన్నారు' అని చెప్పారు. 'వాస్తవంగా కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడానికి భారత్‌కు సరిపడా శక్తి ఉంది. భారత్‌లో జీపీయూ క్లస్టర్లను నిర్మించడంపై చురుగ్గా ముందుకెళ్తున్నాం. ఇప్పటికే భారత్‌లోని ప్రముఖ ఐటీ కంపెనీలతో వివిధ స్థాయిల్లో కలిసి పనిచేస్తున్నాం. ఇండియన్ ఐటీ కంపెనీలు తమ అంతర్జాతీయ సహచరుల కంటే వేగంగా కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయి. అయితే ఈ కంపెనీలు ఇప్పటికే టెక్నాలజీని వివిధ విభాగాల్లో వైవిధ్యపరిచాయి' అని రామచంద్రన్ తెలిపారు.

## ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు భారత జట్టు ఇదే!
# యువ సంచలనానికి నో ఛాన్స్?




క్రికెట్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్న భారత్-ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు జూన్ 20 నుంచి 24 వరకు లీడ్స్ వేదికగా జరగనుంది. ఈ క్రమంలో తొలి టెస్టు కోసం టీమిండియా భారత ప్లేయింగ్ ఎలెవన్‌ను భారత మాజీ క్రికెటర్ దీప్ దాస్‌గుప్తా ఎంచుకున్నాడు. తన ప్లేయింగ్ ఎలెవన్‌లో దాస్‌గుప్తా ముగ్గురు ఫ్రంట్‌లైన్ పేసర్లు,ఇద్దరు స్పిన్నర్లకు ఛాన్స్ ఇచ్చాడు. అయితే ఈ మ్యాచ్‌తో టెస్టు అరంగేట్రం చేసేందుకు సిద్ధంగా ఉన్న యువ ఆటగాడు సాయిసుదర్శన్‌కు మాత్రం దాస్ గుప్తా తన ఎంచుకున్న జట్టులో చోటు ఇవ్వలేదు. అతడి స్థానంలో వెటరన్ ఆటగాడు కరుణ్ నాయర్ వైపు ఈ మాజీ క్రికెటర్ మొగ్గు చూపాడు. సాయిసుదర్శన్ మంచి ఫామ్‌లో ఉన్నప్పటికి, అనుభవాన్ని పరిగణలోకి తీసకుని కరుణ్‌కు అవకాశమివ్వాలని దీప్ దాస్ గుప్తా సూచించాడు. కాగా నాయర్ దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఎనిమిదేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. ఇక దీప్‌దాస్ గుప్తా ఎంపిక చేసిన జట్టులో స్పిన్నర్లుగా రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు చోటు దక్కింది. అదేవిధంగా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా శార్ధూల్ ఠాకూర్ బదులుగా నితీష్ కుమార్ రెడ్డిని దాస్‌గుప్త ఎంచుకున్నాడు. పేస్ బౌలింగ్ విభాగంలో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ద్ కృష్ణలకు అవకాశమిచ్చాడు. ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు దాస్ గుప్తా ఎంపిక చేసిన భారత ప్లేయింగ్ ఎలెవన్
యశస్వీ జైశ్వాల్, కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, శుబ్‌మన్ గిల్(కెప్టెన్), రిషబ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా,మహ్మద్ సిరాజ్,ప్రసిద్ కృష్ణ

# ఇంగ్లండ్‌తో తొలి టెస్టు.. టీమిండియాకు గుడ్ న్యూస్




లీడ్స్ వేదికగా జూన్ 20న ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా స్వదేశానికి వచ్చేసిన హెడ్ కోచ్ గౌతం గంభీర్.. తిరిగి మంగళవారం భారత జట్టుతో కలవనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఏఎన్ఐ వర్గాల సమాచారం ప్రకారం.. గంభీర్ సోమవారం(జూన్ 16) లండన్‌కు బయలుదేరినట్లు తెలుస్తోంది. కాగా ఈ సిరీస్ కోసం గంభీర్ జూన్ 5న భారత జట్టుతో పాటు ఇంగ్లండ్‌కు పయనమయ్యాడు. అతడి నేతృత్వంలో భారత జట్టు నాలుగు రోజుల ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంది.

అయితే తన తల్లి గుండెపోటుతో అస్పత్రిలో చేరడంతో గౌతీ ఉన్నపళంగా జూన్ 11న స్వదేశానికి వచ్చేశాడు. ఇప్పుడు అతడి తల్లి ఆరోగ్యం మెరుగుపడడంతో గంభీర్ తిరిగి ఇంగ్లండ్‌కు పయనమైనట్లు తెలుస్తోంది. ఇక గంభీర్ లేకపోవడంతో భారత జట్టు తమ ప్రాక్టీస్‌ను బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీయస్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కొనసాగించింది. క్రిక్ బజ్‌రిపోర్ట్స్ ప్రకారం.. టీమిండియా సన్నాహాలను లక్ష్మణ్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. లక్ష్మణ్ భారత జట్టుతో కాకుండా తన వ్యక్తిగత పనుల మీద ఇంగ్లండ్‌కు వెళ్లాడు. కానీ గంభీర్ ఉన్నపళంగా స్వదేశానికి వెళ్లిపోవడంతో లక్ష్మణ్ లౌసాన్ నుండి లండన్‌కు వచ్చినట్లు క్రిక్‌బజ్ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. ఇక తొలి టెస్టుకు గిల్ సారథ్యంలోని భారత జట్టు అన్నివిధాల సిద్దమైంది. ఈ టెస్టుకు ముందు ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో భారత సీనియర్, భారత-ఎ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో రాహుల్, గిల్, శార్ధూల్ ఠాకూర్ వంటి మెరుగ్గా రాణించారు. కాగా ఈ సిరీస్ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో భాగంగా జరగనుంది.

**ఇంగ్లండ్‌తో సిరీస్‌కు భారత జట్టు**
శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్,వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, శార్దూల్ సింగ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్, ప్రసిధ్ కృష్ణ, మొహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్

## స్పోర్ట్స్

# సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే వరల్డ్ కప్




ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ముగియడమే ఆలస్యం మరో మెగా టోర్నీ అభిమానులను అలరించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ సోమవారం మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 30న షురూ కానుంది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ ఆరంభం రోజే టీమిండియా బెంగళూరులో శ్రీలంకతో తలపడనుంది. అయితే.. టీమిండియా, పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 5న జరుగనుంది. పహల్గాం ఉగ్రదాడి.. ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల నేపథ్యంలో పాక్ మ్యాచ్‌లకు లంక వేదిక కానుందని ఐసీసీ పేర్కొంది. కొలంబోలో ఏకంగా 11 లీగ్ మ్యాచ్‌లకు ఐసీసీ ఆమోదం తెలిపింది. వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టనుంది. సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న భారత్, శ్రీలంకలు ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నాయి. సెప్టెంబర్ 30 లంక, టీమిండియా పోరుతో మెగా టోర్నీ షురూ కానుంది. అనంతరం అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో ఆసీస్ తలపడనుంది. మొత్తంగా కొలంబోలో 11 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అక్టోబర్ 29న కొలంబో లేదా బెంగళూరులో తొలి సెమీ ఫైనల్ జరుగనుండగా.. అక్టోబర్ 30న బెంగళూరులో రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఉండనుంది. టైటిల్ విజేతను నిర్ణయించే ఫైనల్ పోరు నవంబర్ 2న జరుగనుంది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు లేదా కొలంబో వేదిక కానుందని ఐసీసీ వెల్లడించింది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143